క్లుప్తంగా

సర్కారు బడి భవిష్యత్తుకు బాట



రంగంపేటలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల ఇంటింటి ప్రచారం

కొల్చారం(నర్సాపూర్): శిక్షణ పొందిన నిష్ణాతులైన ఉపాధ్యాయులు మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక విద్యావిధానాన్ని విద్యార్థులకు అందిస్తూ వస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని మండలంలోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు కోరుతున్నారు. మండల వ్యాప్తంగా నాలుగవ రోజు బడిబాటలో భాగంగా మంగళవారం ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. తమ పాఠశాలలోని ప్రత్యేకతలను తెలుపుతూ కరపత్రాలను రూపొందించి, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు.

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ



యాదగిరి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్ : మండలానికి చెందిన బాధిత కుటుంబాలను స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి మంగళవారం పరామర్శించారు. పట్టణానికి చెందిన యాదగిరి ఈనెల 7న స్థానిక రాయరావు చెరువులో మునిగి మృతి చెందగా అతడి భార్య రాంబాయి ఇతర కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించి ఓదార్చారు. ప్రమాదం వివరాలు అడిగి తెలుసుకుని అతడి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. కాగా బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసానిచ్చారు. నర్సాపూర్ మున్సిపల్ ఉద్యోగి సల్లా మురళి తల్లి చంద్రకళ ఇటీవల మరణించడంతో ఆయనను ఎమ్మెల్యే పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు సత్యం గౌడ్, నయీం, బబియా, భిక్షపతి, ప్రసాద్, మహ్మద్, హైమద్ ఉన్నారు.

వితంతు పింఛన్లు మంజూరు చేయండి



ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కౌడిపల్లి(నర్సాపూర్): ముక్రాజ్‌పల్లిలో వితంతువులకు పింఛన్లు మంజూరు చేయాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ కలీముల్లకు కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావ్, ముక్రాజ్‌పల్లి మాజీ ఉప సర్పంచ్ వెంకటేశం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముక్రాజ్‌పల్లిలో 14మంది వితంతువులకు పదేళ్లుగా మంజూరు కాలేదన్నారు. అధికారులు స్పందించి త్వరగా మంజూరు అయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆరిఫ్, శ్రీనివాస్, డాకయ్య, బాలు పాల్గొన్నారు.

అమ్మవారికి 108 కలశాలతో అభిషేకం



అమ్మవారికి 108 కలశాలతో ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటలోని కన్యకపరమేశ్వరి వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళ భక్తులు 108 కలశాలను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు హోమం తీర్థ ప్రసాదాల పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

నర్సాపూర్ రూరల్: విద్యుదాఘాతానికి గురై పాడి గేదె మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని నత్నయ్యపల్లిలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన ప్యాట ఆంజనేయులుకు చెందిన పాడి గేదె మేత కోసం తీసుకెళ్తుండగా షేర్‌ఖాన్‌పల్లి క్రాస్ రోడ్ వద్ద రక్షణ కంచె లేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షాక్‌కు గురై మృతి చెందింది. పాడి గేదె విలువ రూ.70 వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

బడిబాట సరే.. వసతులేవీ?

- 12 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ
- ప్రశ్నార్థకంగా విద్యార్థుల భవిష్యత్
- నీరుగారుతున్న విద్యాహక్కు చట్టం



మూతపడిన రంజానాయక్ తండా పాఠశాల

రేగోడ్(మెదక్): ప్రతి ఒక్కరూ చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని బడిబాట వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నా అందుకనుగుణంగా చర్యలు ఉండటం లేదు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ బడుల్లో ఫలితాలు వస్తున్నా.. ఉపాధ్యాయుల కొరత మాత్రం వెంటాడుతోంది. విద్యాహక్కు చట్టం నీరుగారుతుండటం వలన విద్యార్థుల భవిషత్ ప్రశ్నార్థకంగా మారుతోందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 18 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో ప్రాథమిక పాఠశాలలు 22, ప్రాథమికోన్నత పాఠశాలలు 2, ఉన్నత పాఠశాలలు 4, కేజీబీవీ 1, మోడల్ స్కూల్ 1 ఉన్నాయి. మొత్తంగా ఏటా సుమారు 1,927 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

ఎనిమిది ప్రాథమిక పాఠశాలల్లో సింగిల్ టీచర్ మాత్రమే ఉన్నారు. ఈ ఎనిమిది పాఠశాలల్లో మరో ఎనిమిది మంది ఎస్‌జీటీ ఉపాధ్యాయులు అవసరం ఉంది. సింగిల్ టీచర్ ఉన్న పాఠశాలలకు టీచర్ సెలవు పెడితే ఆ రోజు బడికి తాళం పడుతోంది. దాంతో విద్యార్థులకు చదువు అందటం లేదు. మూడు ఉన్నత పాఠశాలల్లో ముగ్గురు తెలుగు పండిత్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో కలిపి మొత్తంగా 12 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండటం వలన విద్యార్థులకు విద్య అందని ద్రాక్షగా మిగులుతోంది.

ఆ బడి తెరుచుకునేనా?

మండలంలోని రంజానాయక్ తండాలోని ప్రాథమిక పాఠశాలలో టీచర్ డిప్యుటేషన్‌పై వెళ్లడంతో గతేడాది కొన్ని నెలల పాటు బడికి తాళం పడింది. ఈ విషయాన్ని పలుమార్లు సాక్షిలో పలుమార్లు కథనాలు వెలువడినా బడి మాత్రం తెరుచుకోలేదు. విద్యార్థులు ఏమైపోయినా పరవాలేదు కానీ..ఆ టీచర్‌కు మాత్రం ఉన్నతాధికారుల అండగా నిలుస్తున్నారన్న విమర్శలు లేకపోలేవు.

ఉన్నతాధికారులకు నివేదిస్తా



మండలంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో కలిపి 12 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు ఉన్నాయి. సింగిల్ టీచర్ సెలవు పెడితే ఆ రోజు ఆ పాఠశాల మూతపడే అవకాశం ఉంది. ఉపాధ్యాయులను నియమించాలని ఉన్నతాధికారులకు నివేదిస్తా.

– గురునాథ్, ఎంఈఓ

కొమ్మినేని అరెస్ట్ అక్రమం



కౌడిపల్లి: ఆర్‌డీఓ మహిపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు



ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

- కౌడిపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద జర్నలిస్టుల నిరసన
- ఆర్‌డీఓకు వినతిపత్రం అందజేత

కౌడిపల్లి(నర్సాపూర్): సాక్షి సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు అక్రమ అరెస్ట్, ఏపీలో సాక్షి కార్యాలయాలపై దాడులను నిరసిస్తూ మండలంలో నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం కౌడిపల్లి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద జర్నలిస్టులు ఆందోళన నిర్వహించారు. అనంతరం మండలంలోని ధర్మాసాగర్‌లో భూభారతి రెవెన్యూ సదస్సుకు హాజరైన నర్సాపూర్ ఆర్‌డీఓ మహిపాల్‌రెడ్డి, స్థానిక తహసీల్దార్ అంజనేయులుకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ సభ్యులు మాట్లాడుతూ సాక్షి టీవీ డిబేట్‌లో వక్తలు చేసిన ఆరోపణలను సాక్షి ఖండించిందన్నారు. అయినా రాజకీయ కక్షతో జర్నలిస్టును అరెస్ట్ చేయడం సరికాదన్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వ్యవహరిస్తున్న తీరును సాక్షి ఎప్పటికప్పుడు ప్రజలముందుకు తీసుకొస్తున్నదన్నారు. దీంతో జీర్ణించుకోలేని కూటమి ప్రభుత్వం అనుచరులతో సాక్షి కార్యాలయంపై దాడులు చేయించడం సరికాదన్నారు. నిరసన కార్యక్రమంలో జర్నలిస్టులు దుర్గయ్య, రాయగిరి, మల్లేష్, రవిగౌడ్, సుభాష్‌గౌడ్, కుమార్, శేఖర్‌గౌడ్, శరత్, ప్రశాంత్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్‌లో ధర్నా

నర్సాపూర్ రూరల్: 'సాక్షి'సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాస్‌రావు అక్రమ అరెస్టును నిరసిస్తూ మంగళవారం నర్సాపూర్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో పాత్రికేయులు నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ మహిపాల్‌కు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జర్నలిస్టు సంఘాల నాయకులు జి.భిక్షపతి, జక్కుల శ్రీనివాస్, వల్దాస్ వెంకటేష్‌గౌడ్, అశోక్‌రెడ్డి, గాలి మహేశ్, బబ్బూరి సుధాకర్, ప్రసాద్‌గౌడ్, నిరుడి భిక్షపతి, కుద్రత్ అలీ(శబ్బు), వినోద్‌కుమార్, ఆకుల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సహకరించాలి

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో విద్యాభివృద్ధికి తల్లిదండ్రులు ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన కార్మికులు పరిశుద్ధ్య కార్మికులు సహకరించాలని ఎంఈఓ వెంకటేశం అన్నారు. మంగళవారం పేటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆయా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మధ్యాహ్న భోజన కార్మికులు, స్కావెంజర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో మెనూ ప్రకారం విద్యార్థులకు మంచి రుచికరమైన నాణ్యమైన భోజనం అందించేలా జాగ్రత్తలు చేపట్టాలన్నారు.

ఆస్పత్రిలో పండ్లు పంపిణీ

చిన్నశంకరంపేట(మెదక్): బీఆర్ఎస్ మెదక్ నియోజవర్గ ఇన్‌చార్జి కె.తిరుపతిరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా చిన్నశంకరంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్, మాజీ ఎంపీటీసీ ప్రసాద్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో పేదలకు మేలు

చిన్నశంకరంపేట(మెదక్): బీజేపీ పాలనలో గ్రామీణ ప్రాంతంలోని పేదలకు ఎంతో మేలు జరిగిందని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం నార్సింగి మండలం వల్లూర్ గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు శిర్న చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మోదీ 11 ఏళ్ల పాలనపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ స్థాయిలో అనేక కేంద్ర పథకాలు అమలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈజీఎస్, పీఎం కిసాన్, రేషన్ బియ్యం పథకాల ద్వారా పేదలకు మేలు జరుగుతుందని చెప్పారు,. బీజేపీ మండల నాయకులు శ్రీనివాస్, మన్నే యాదగిరి, నరేష్, నర్సింహులు, వల్లూర్ మాజీ ఉప సర్పంచ్ రాములు పాల్గొన్నారు.

బస్‌పాస్ చార్జీలు తగ్గించాలని వినతి

మెదక్ కలెక్టరేట్: ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లు ఇవ్వాలని, పెంచిన బస్సుపాస్ చార్జీలను వెంటనే తగ్గించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అజయ్ డిమాండ్ చేశారు. డిపో మేనేజర్ సురేఖకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల బస్‌పాస్ చార్జీలు పెంచడంసరికాదన్నారు. గతంలో రూ.1,150 ఉంటే ఇప్పుడు రూ.1,400లకు పెంచారని, పేద విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి పెరుగుతుందని వాపోయారు. పెంచి న చార్జీల కారణంగా పేద విద్యార్థులు చదు వుకు దూరమయ్యే పరిస్థితి నెలకొందని, ప్రభుత్వం వెంటనే చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. అలాగే అర్హులైన పేద విద్యార్థులకు ఉచితంగా బస్‌పాస్‌లు ఇవ్వాలని, లేకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో గొర్రెల కాపరికి గాయాలు

రామాయంపేట(మెదక్): విద్యుదాఘాతంతో గొర్రెల కాపరి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన సోమవారం రామాయంపేట పట్టణ శివారులో చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన గాయంతి మల్లేశం తన జీవాలను మేపడానికి హెచ్‌పీ పెట్రోల్ పంప్ వెనుక భాగంలో ఉన్న చెరువుకట్ట వైపు వెళ్లాడు. ఈ క్రమంలో అతనికి ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభం వద్ద షాక్ కొట్టింది. ఈ ప్రమాదంలో శరీరం, కాళ్లు, చేతులు కాలి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. గొర్రెల కోసం కరెంటు వైర్ల కింద ఉన్న చెట్లును నరుకుతున్న క్రమంలో మండలు వైర్లకు తాకి అతడు షాక్‌కు గురై గాయపడ్డాడని విద్యుత్‌శాఖ అధికారులు పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ



అల్లాదుర్గంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం మండలంలోని నిరుపేదలు ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంగళవారం మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హౌసింగ్ ఏఈ కౌశిక్ మాట్లాడుతూ... ప్రభుత్వ నిబంధనల ప్రకారం 44 గజాల నుంచి 66 గజాలలోపు మాత్రమే ఇళ్లు కట్టుకోవాలని లేకుంటే బిల్లులు మంజూరు కావన్నారు. ఇళ్లు మంజూరైన 3 నెలల లోపు పనులు ప్రారంభించి, నిర్మించుకోవాలని లేదంటే మంజూరు కూడా రద్దైపోతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బల్‌రాం , శేషారెడ్డి, చెన్నప్ప, చంద్రశేఖర్, బాలకీషన్, బేతయ్య, ప్రభు, బాలరాజ్, విఠల్ పాల్గొన్నారు.

పాపన్నపేటలో..

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రమైన పాపన్నపేటలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంచాయతీ కార్యదర్శి నయీం అందజేశారు. గ్రామంలో మొత్తం 62 మంది లబ్ధిదారులకు మంజూరు అయ్యాయని చెప్పారు. నిబంధనల ప్రకారం ఇళ్లు నిర్మించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఆకుల శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, ఇందిరమ్మ కమిటీ సభ్యులు నిరలాక్షప్ప, నరేందర్‌గౌడ్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు రాములు తదితరులు పాల్గొన్నారు.

నార్సింగిలో..

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో 93 మందికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఎంపీడీఓ ఆనంద్ కుమార్ పింపిణీ చేశారు. మంగళవారం నార్సింగి గ్రామపంచాయతీ వద్ద లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఈఓ నాగభూషణం, కాంగ్రెస్ నాయకులు యాదగిరి, రాజేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హరిత యోగాపై అవగాహన



యోగాపై అవగాహన కల్పిస్తున్న భరత్

రామాయంపేట(మెదక్): మండలంలోని కాట్రియాల గ్రామంలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో హరిత యోగా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మొక్కలు నాటారు. యోగా శిక్షకులు మద్దెల భరత్ గ్రామస్తులకు యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రైతు వేదిక వద్ద మొక్కలు నాటారు. పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి, మాజీ సర్పంచులు, పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ గురుకుల కళాశాలలో చేరండి

- పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని విద్యార్థినిలు మహిళా డిగ్రీ గురుకుల కళాశాలలో చేరి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్‌లో రామాయంపేట సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల ప్రవేశాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 2025–26 విద్యా సంవత్సరానికి గానూ కళాశాలలో సీట్లు ఉన్నట్లు తెలిపారు. ఇందులో సోషల్ వెల్ఫేర్ విద్యార్థినిలకు 60 శాతం, ఇతర విద్యార్థినిలకు 40శాతం చేరే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్ , డీఈఓ రాధా కిషన్, కళాశాలల జిల్లా కోఆర్డినేటర్, ప్రిన్సిపల్ శిరీష పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు అవగాహన



చేగుంట(తూప్రాన్): సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ నీరజ



రామాయంపేట(మెదక్): పరిశుభ్రతకు సంబంధించి కిట్లు అందజేస్తున్న ఎంఈవో శ్రీనివాస్

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంట కాంప్లెక్స్ పాఠశాలల ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన నిర్వాహకులు, శానిటైజర్ సిబ్బందికి మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ నీరజ మాట్లాడుతూ విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఐదు నెలలుగా మధ్యాహ్న భోజన బిల్లులు రావడం లేదని ఆయన ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లారు.

పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలి

కౌడిపల్లి(నర్సాపూర్): స్కావెంజర్లు ప్రతిరోజు పాఠశాలను శుభ్రం చేసి పరిశుభ్రంగా ఉంచాలని ఎంఈఓ బాలరాజు తెలిపారు. మంగళవారం కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో మండలంలోని వివిధ పాఠశాలల్లో పనిచేసే స్కావెంజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు సాజిత్‌అలి, సీఆర్‌పీలు స్కావెంజర్లు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి

కొల్చారం(నర్సాపూర్): విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో, నాణ్యమైన భోజనాన్ని అందించేలా చర్యలు చేపట్టాలని మండల విద్యాధికారి సత్యనారాయణరావు సూచించారు. రాష్ట్ర, జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వహణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కాంప్లెక్స్‌ల పరిధిలోని మధ్యాహ్న భోజన కార్మికులకు, ప్రధాన ఉపాధ్యాయులకు మంగళవారం ఒకరోజు శిక్షణను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...వంట కోసం వాడే పాత్రలు పరిశుభ్రంగా ఉంచడం, స్వచ్ఛమైన తాగునీటిని అందించేలా పాఠశాల ఆవరణలో చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వర్షాకాలం కావడం వేడి వంటకాన్ని విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. అంతకుముందు పాఠశాలలోని పారిశుద్ధ్య కార్మికులకు పాఠశాల పరిసరాల్లో తీసుకోవలసిన పరిశుభ్రతపై శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు,ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలి

రామాయంపేట(మెదక్): ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో విధిగా మొక్కలు నాటడంతోపాటు కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని మండల విద్యాధికారి శ్రీనివాస్ సూచించారు. మంగళవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్కావెంజర్ల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈనెల 12న స్కూళ్లు ప్రారంభం అవుతున్నాయని, టాయిలెట్లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పాఠశాల గదుల శుభ్రతకు సంబంధించి చీపుర్లు, బ్రష్‌లు, టాయిలెట్ క్లీనర్లు, ఇతర సామగ్రిని స్కావెంజర్లకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్కావెంజర్లతో పాటు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

బడుల్లో పారిశుద్ధ్యానికి పెద్దపీట

పాపన్నపేట(మెదక్): పారిశుద్ధ్య కార్మికులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు పారిశుద్ధ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఎంఈఓ ప్రతాప్ రెడ్డి సూచించారు. పాపన్నపేటలో మంగళవారం జరిగిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...గురువారం నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పారిశుద్ధ్య , మధ్యాహ్న భోజన కార్మికులు పాఠశాల ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించి, ఆవరణను శుభ్రం చేయాలని సూచించారు. తరగతి గదులు , శౌచాలయాలు, త్రాగునీటి ట్యాంకులు పరిశుభ్రం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం మహేశ్వర్, కార్మికులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే సదస్సులు

శివ్వంపేట(నర్సాపూర్): భూ సమస్యల పరిష్కారం కోసమే భూ భారతి సదస్సులు నిర్వహిస్తున్నారని తహసీల్దార్ కమలాద్రి చెప్పారు. సమస్య ఉన్న రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలోని ఉసిరకపల్లి, పాంబండ గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. భూ సమస్యలపై రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. ఉసిరికపల్లిలో కొండయ్య కుంట భూములు సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని వినతి పత్రం ఇచ్చారు. రెండు గ్రామాల్లో 115 దరఖాస్తులు వచ్చినట్లు ఉప తహసీల్దార్ షఫీయొద్దీన్, ఆర్ఐ కిషన్ తెలిపారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నిజాంపేట(మెదక్): కోర్టుల్లో పెండింగ్ కేసుల పరిష్కారానికి మెదక్ కోర్టు పరిధిలో ఈ నెల 10 నుంచి 14 వరకు నిర్వహించే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని నిజాంపేట ఎస్ఐ రాజేశ్ సూచించారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ నిజాంపేట స్టేషన్ పరిధిలోని ఏవైనా గొడవలకు సంబంధించిన కేసులుంటే లోక్‌అదాలత్‌లో రాజీ కుదుర్చుకోవాలని సూచించారు.

పాఠశాల ప్రారంభం రోజే యూనిఫామ్‌లు

పాపన్నపేట(మెదక్): ఈ నెల 12న గురువారం పాఠశాలల ప్రారంభం కానున్నాయి. అదే రోజు విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేయాలని ఎంఈఓ ప్రతాప్ రెడ్డి సూచించారు. మంగళవారం మండల వనరుల కేంద్రంలో ఆయన పాఠశాలల హెచ్‌ఎంలకు యూనిఫాంలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో విద్యార్థులకు ఉచిత యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేయాలని సూచించారు. మండలంలో 62 పాఠశాలలు ఉన్నాయని, మొదటి విడతలో ఒక జత యూనిఫాంలు అందజేయనున్నట్లు తెలిపారు.

వరుస దొంగతనాలతో బెంబేలు



బీరువా ధ్వంసం చేసి బట్టలను చిందరవందరగా చేసిన దొంగలు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటలో ఐదు రోజులుగా వరుస దొంగతనాలతో జనాలు భయాందోళన చెందుతున్నారు. చేగుంట సీఎంఆర్ కాలనీలో గురువారం రాత్రి ఓ ప్రైవేటు పరిశ్రమకు చెందిన సిబ్బంది కిరాయికి ఉంటున్న ఇంట్లో తాళం పగులగొట్టి బట్టలతో పాటు విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలు, వేలాది రూపాయల తినుబండారాలను ఎత్తుకెళ్లారు. శుక్రవారం రాత్రి అదే కాలనీలో ఓ విలేకరి ఇంట్లో నగదు, వెండి వస్తువులు, బట్టలు ఎత్తుకెళ్లారు. శనివారం రాత్రి ప్రభుత్వ కళాశాల పక్కనే ఉన్న హమాలీ కాలనీకి చెందిన చిట్టబోయిన అంజనేయులు ఇంట్లో బంగారు నగలు, వెండి నగలు, పదివేల నగదు దొంగతనం జరిగింది. ఆదివారం రాత్రి మెదక్ రోడ్డులోని బాలపోచయ్య ఇంట్లో తాళం పగులగొట్టి బట్టలతో పాటు విలువైన వస్తువులు ఎత్తుకెళ్లారు. సోమవారం రాత్రి సీఎంఆర్ కాలనీలో కిరాయికి ఉంటున్న లెక్చరర్ శంకర్‌కు చెందిన ప్యాషన్ బైకును అపహరించారు. వరుస దొంగతనాలతో చేగుంటలోని జనాలు భయపడుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు నిఘా ఏర్పాటు చేసి దొంగలను పట్టుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

లోక్ అదాలత్‌తో ప్రయోజనం

నిజాంపేట(మెదక్): లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని నిజాంపేట ఎస్ఐ రాజేశ్ సూచించారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. నిజాంపేట స్టేషన్ పరిధిలోని ఏవైనా గొడవలకు సంబంధించి కేసులుంటే లోక్ అదాలత్‌లో రాజీ కుదుర్చుకోవాలని సూచించారు. లోక్ అదాలత్ మెదక్ కోర్టు పరిధిలో ఈనెల 10 నుంచి 14 వరకు కొనసాగుతుందని తెలిపారు.

రేణుక ఎల్లమ్మ బోనాల ఊరేగింపు

- వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతారెడ్డి



బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం వెల్దుర్తిలో శ్రీరేణుక ఎల్లమ్మ దేవాలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గౌడ సంఘం ఆధ్వర్యంలో బోనాలు ఉత్సవాలు కనులపండువగా నిర్వహించారు. మహిళలు బోనాలను ఎత్తుకుని భారీ ఎత్తున ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మార్గమధ్యంలో పోతురాజుల హంగామా, శివసత్తుల పూనకాలు, యువతీయువకుల కేరింతల మధ్య కోలాహలంగా సాగింది. ఉత్సవాల్లో ఎమ్మెల్యే సునీతారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ సుహాసినిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డితో, ఆయా పార్టీల నాయకులు పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.